క్లుప్తంగా

కేసీఆర్‌ను కలిసిన చల్మెడ



మాజీ సీఎం కేసీఆర్‌కు రాజన్న ప్రసాదం అందజేస్తున్న లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను శనివారం బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు మర్యాదపూర్వకంగా కలిశారు. రాజన్న ప్రసాదం అందజేసి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

దివ్యాంగుడికి అందిన పింఛన్

సాక్షి స్పందన



పింఛన్ డబ్బులతో రాజు

కోనరావుపేట: పింఛన్ రాక పదినెలలుగా ఇబ్బందులు పడుతున్న దివ్యాంగుడికి పింఛన్ అందింది. 'రెన్యూవల్ కాక.. పింఛన్ రాక' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని కనగర్తికి చెందిన లింగంపెల్లి రాజు సదరం సర్టిఫికెట్ గడువుతేదీ ముగిసి మళ్లీ రెన్యూవల్ కాకపోవడంతో ఇబ్బందులు పడ్డాడు. అధికారులు విచారణ చేపట్టి సదరం సర్టిఫికెట్ రెన్యూవల్ చేశారు. పింఛన్ రావడంతో రాజు హర్షం వ్యక్తం చేశాడు.

చింతోజు భాస్కర్‌కు డాక్టరేట్



డాక్టరేట్‌తో భాస్కర్

సిరిసిల్లటౌన్: మానేరు స్వచ్ఛంద సంస్థ ద్వారా సామాజిక సేవలు అందిస్తున్నందుకు జిల్లా కేంద్రానికి చెందిన చింతోజు భాస్కర్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. చెన్నైలో శుక్రవారం గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ స్నాతకోత్సవం జరుగగా డాక్టరేట్ అందజేశారు.

పర్యావరణ పరిరక్షకుడికి వివేకానంద పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రమేశ్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన పర్యావరణ పరిరక్షకుడు దుంపెన రమేశ్ శనివారం హైదరాబాద్‌లో స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ పురస్కారం అందుకున్నారు. 14 ఏళ్లుగా రమేశ్ మొక్కలు పెంచుతూ వాటిని సంరక్షిస్తున్నాడు. ఆయన సేవలను గుర్తించి అవార్డు అందజేశారు.

'మల్లుగారి'కి తెలుగు వెలుగు..



అవార్డు అందుకుంటున్న నర్సాగౌడ్

గంభీరావుపేట: మండలకేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త, మా అనాథ వృద్ధుల ఆశ్రమం నిర్వహకుడు మల్లుగారి నర్సాగౌడ్‌కు శనివారం హైదరాబాద్‌లో తెలుగు వెలుగు సాహితి కళావేదిక వారు తెలుగు వెలుగు నంది జాతీయ పురస్కారం అందజేశారు. 46ఏళ్లుగా చేస్తున్న సేవలను గుర్తించి అవార్డు అందించారు.

భవిత సెంటర్ విద్యార్థులకు..



అవార్డు అందుకుంటున్న చిన్నారులు

వేములవాడరూరల్: వేములవాడ భవిత సెంటర్‌లో చదివే విద్యార్థులు లక్ష్మీప్రణతి, నవదీప్‌లకు బెస్ట్ స్పోర్ట్స్ చిల్డ్రన్స్‌గా అవార్డులు వచ్చినట్లు నిర్వాహకులు కత్తి జయలక్ష్మి తెలిపారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

రంగు మెరిసె.. వాకిలి మురిసె

- ముంగిట్లో ముత్యాల ముగ్గులు
- అలరిస్తున్న అతివల అభిరుచులు
- ఇంటింటా ఆకట్టుకుంటున్న రంగవల్లులు



ముగ్గుల్లో కలిపే రంగులు



సిరిసిల్లలో ముగ్గు వేస్తున్న మహిళ



సిరిసిల్లటౌన్: ఏ ఇంటి ముంగిట్లో చూసినా ముత్యాల ముగ్గులు మురిపిస్తున్నాయి. సంక్రాంతి పండుగ నేపథ్యంలో వారం రోజుల ముందు నుంచే అతివలు తమ ఇంటి వాకిలిలో కల్లాపి చల్లి ముగ్గులతో అలంకరిస్తున్నారు. ఆధునిక యుగంలో కూడా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నేటి మహిళలు మునివేళ్లతో ముగ్గుల కళ ప్రదర్శిస్తున్నారు. సరికొత్త ఆలోచనలు, వైవిధ్యమైన డిజైన్లలో ఆకట్టుకుంటున్న ముగ్గులపై కథనం.

సంక్రాంతి అంటే ముగ్గుల ప్రత్యేకం

ఆంగ్ల సంవత్సరంలో వచ్చే మొదటి పండుగ సంక్రాంతి. చలికాలం అయినా అతివలు, యువతులు సూర్యోదయానికి ముందే లేచి గంటల తరబడి తీరిగ్గా ముంగిట్లో ముగ్గులను పెట్టడం కనిపిస్తుంది. సంక్రాంతి పండుగకు పంట ధాన్యాలు ఇళ్లకు చేరే నేపథ్యంలో అష్టలక్ష్ములను సంతోషింప జేసేలా సాదరంగా వారిని ఇంటికి ఆహ్వానించడానికే ముగ్గులు వేస్తారని పెద్దలు చెబుతారు. అందుకే తెలుగింటి ఆడపడుచులు ముగ్గులు వేయడానికి పురాతన కాలం నుంచి నేటివరకు ఇష్టపడుతూ సంప్రదాయాలను గౌరవిస్తున్నారు.

ముగ్గుల ప్రాముఖ్యత..

డిసెంబర్, జనవరి నెలల్లో మహా విష్ణువుకు ఇష్టమైన ధనుర్మాసం సందర్భంగా పూజలు, ఆధ్యాత్మికతకు నెలవుగా ఉంటుంది. అందుకే ఈసమయంలో వాకిట్లో ముగ్గులు వేయడం వల్ల ధార్మిక క్రతువులో భాగంగా పరిగణించవచ్చు. చేతి మునివేళ్లతో ముగ్గులు వేయడంపై శాస్త్రీయత ఉంది. ఇలా చేస్తే నాడీ మండలం పనితీరు పెరగడంతో పాటు కల్లాపి చల్లడం వల్ల ఉదయాన్నే మహిళలకు వ్యాయామం అవుతుంది. పైగా ముగ్గుల్లో పెట్టే చుక్కలను కలుపుతూ అందమైన డిజైన్లను ఆవిష్కరించడంలో లెక్కల పట్ల అవగాహన, నేర్పరితనం పెరుగుతుందని పెద్దలు చెబుతున్నారు.

ముంగిట్లో కలర్‌ఫుల్‌గా..

చుక్కలతో ముగ్గులు వేయడం సంప్రదాయం. కొందరు సాధారణంగా మునివేళ్లతో గీత ముగ్గులు వేస్తుంటారు. నేటి ఆధునిక యువతులు, మహిళలు ముంగిట్లో అలరించేలా వేస్తున్న అందమైన డిజైన్ల ముగ్గులు అదుర్స్ అనిపిస్తున్నాయి. వీటికోసం వ్యాపారులు రకరకాల ముగ్గుపొడిలను తెప్పించి అమ్ముతున్నారు. ప్రస్తుత నాగరిక జీవితంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల్లో కూడా చాలా మంది వారం రోజుల పాటు ముగ్గులకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

ముగ్గులకు ప్రత్యేకం సంక్రాంతి



ముగ్గులు వేయడమంటే ఇష్టం. అందుకే సంక్రాంతి పండుగ ఎప్పుడు వస్తుందా అని చూస్తాం. మన సంప్రదాయానికి ప్రతీకలైన ముగ్గులను అన్నితరాల వారికి అందించాలి. చిన్నప్పటి నుంచి సంక్రాంతి ముగ్గులు వేయడానికి ఇష్టపడుతాం. రంగురంగుల ముగ్గులు ఇంటికి అందాన్ని తెస్తాయి.

– కోడం శ్రీదేవి, సిరిసిల్ల

అందమైన కళ



ముగ్గులు వేయడం అంటే చుక్కలు పెట్టి గీతలు గీయడం కాదు. మహిళలకు ఆరోగ్యాన్ని పంచే అందమైన కళ. మన సంస్కృతి, సంప్రదాయాలలో ముగ్గులకు ప్రత్యేక స్థానం ఉంది. పురాతన ఆలయాల్లోని స్తంభాలపై ముగ్గులను చెక్కించారు. సంక్రాంతి రోజుల్లో తప్పకుండా వాకిలిలో కల్లాపి చల్లి ముగ్గులు వేయడం తరాలుగా వస్తున్న ఆచారం.

– చీకోటి జ్యోతి, సిరిసిల్ల

చిన్నప్పుడు పోటీ పడేవాళ్లం



చిన్నప్పుడు ముగ్గులు వేయడానికి పోటీపడే వాళ్లం. ముగ్గులు అందంతో పాటు ఆరోగ్యాన్నిస్తాయి. ఒకప్పుడు పేడతో వాకిలి అలికి ముగ్గులు వేసేవాళ్లం. ఇప్పుడు సిమెంట్ ఫ్లోర్‌పై రంగవల్లులు వేస్తున్నాం. కాలం మారినా సంస్కృతి మారదు. పేడతో చేతులకు చర్మవ్యాధులు రాకుండా ఉంటాయి.

– పుల్లూరి రాధ, గృహిణి, సిరిసిల్ల



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని గిద్ద చెరువు వద్ద ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో చిన్నారుల కోసం ఉన్న ఆటవస్తువులు పని చేయడం లేదు. ఆడుకునే వస్తువులపై మెయింటనెన్స్ కరువై పని చేయకుండా తయారయ్యాయి. ఉయ్యాల తెగిపోయి, రౌండ్‌గా తిరిగే రేయిలింగ్ బేరింగ్‌లు పనికి రాకుండా పోతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేక చిన్నారులకు ఆట వస్తువులు అందుబాటులో ఉండడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
సత్తయ్య, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట, సెల్ నంబర్: 99897 73073

వాట్సాప్ చేయండి..
మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సిరిసిల్లటౌన్: కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి, పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం రాజీవ్‌నగర్, సిరిసిల్లలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 150 మందికి బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. డాక్టర్ శ్రీకాంత్ వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా మెడికవర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ, స్థానిక ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతోనే వైద్య శిబిరం నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఉమా రాజేశం, ఈశ్వర్, గణేశ్, ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, శ్రీకాంత్, లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ భవన్‌ను కూలుస్తారా.. కూల్చుమంటారా?

- విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న విప్ శ్రీనివాస్

ముస్తాబాద్: సిరిసిల్లలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన బీఆర్‌ఎస్ భవన్‌ను మీరే కూలుస్తారా.. లేక ప్రభుత్వాన్ని కూల్చుమంటారా తేల్చుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ప్రశ్నించారు. శనివారం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. సిరిసిల్లలో ఎకరం భూమిని బీఆర్‌ఎస్‌కు కేటాయిస్తే, రెండెకరాల్లో కార్యాలయాన్ని నిర్మించారన్నారు. పదేళ్లు సిరిసిల్లను విధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేశారని, ఇందులో పావువంతు ప్రభుత్వం స్వాధీనం చేసుకుందన్నారు. అధికారులను విమర్శించడం సరికాదని, చట్టం తన పని తాను చేసుకు పోతుందన్నారు. కేటీఆర్ ఫ్రస్టేషన్‌లో మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, పార్లమెంట్ ఎన్నికల కోకన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, రాజిరెడ్డి, రాంరెడ్డి, గజ్జెల రాజు, పెద్దిగారి శ్రీనివాస్, గుండెల్లి శ్రీనివాస్, భాను, కొమురయ్య, తిరుపతి, నర్సింలు, కొండల్‌రెడ్డి, నరేశ్, రాజు, స్వేచ్ఛ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక ఆరోగ్యం

సిరిసిల్లటౌన్: క్రీడలు మానసిక ఆరోగ్యాన్ని పంచుతాయని పీఆర్టీయూ బాధ్యులు (ఎమ్మెల్సీ ఆశావహ అభ్యర్థి)వంగ మహేందర్ రెడ్డి అన్నారు. టీచర్స్ ప్రీమియర్ లీగ్–4 క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో ప్రారంభించి మాట్లాడారు. పోటీతత్వాన్ని పెంచేలా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పర్శ హన్మాండ్లు, టీపీఎల్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శర్మన్ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు స్టాలిన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయకృష్ణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, అధ్యక్షుడు నవీన్, ప్రధాన కార్యదర్శి రవీందర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యాన్ని వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట: ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని పెద్ద లింగాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఆరోగ్య కేంద్రం చుట్టుపక్కల ఉన్న రామాజీపేట, దాచారం, చిన్నలింగాపురం, అనంతగిరి గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా వైద్యాధికారి రజిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బి.రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినీ రచయితపై ఏఎస్పీకి ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

వేములవాడ: ఇటీవల ఓ న్యూస్ చానెల్ డిబేట్‌లో రజకులను కించపరిచేలా మాట్లాడిన సినీ రచయిత త్రిపురనేని చిట్టిబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్ సూచన మేరకు రజక సంఘం ఆధ్వర్యంలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ స్ఫూర్తితో సగర్వంగా జీవిస్తున్న రజకులను కించపరిచేలా మాట్లాడిన చిట్టిబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఫిర్యాదు చేసినవారిలో ప్రధాన కార్యదర్శి లింగంపల్లి దేవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వనపర్తి సతీశ్, నాయకులు మొగిలి అంజయ్య, సుద్దాల నర్సయ్య, నేరెళ్ల నర్సయ్య, నరేశ్, నేరెళ్ల శ్రీనివాస్, మొగిలి చంద్రశేఖర్, కాసర్ల శ్రీనివాస్, మొగిలి రమేశ్, రేవంత్, కుంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• లింబ్యానాయక్ మృతి పార్టీకి తీరని లోటు

ఎల్లారెడ్డిపేట: బీఆర్‌ఎస్ కార్యకర్త భూక్య లింబ్యానాయక్ మృతి పార్టీకి తీరని లోటని జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్ పంచాయతీ పరిధి భూక్య తండాలో శనివారం వేకువజామున లింబ్యానాయక్ గుండెపోటుతో మృతి చెందారు. లింబ్యానాయక్ మృతదేహానికి ఆగయ్య నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

• పరామర్శ

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎడ్ల సందీప్ తండ్రి ఎడ్ల నర్సయ్య విద్యుత్ షాక్‌తో మరణించగా, బాధిత కుటుంబ సభ్యులను ఎన్నారై రాధారపు సత్యం శనివారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు సింగారం దేవరాజు, జీడి శ్రీనివాస్ ఉన్నారు.

• డీఎండబ్ల్యూవోపై చర్య తీసుకోవాలి

సిరిసిల్లటౌన్: మైనార్టీ సంక్షేమశాఖ డీఎండబ్ల్యూవో సర్వర్‌పై చర్యలు తీసుకోవాలని పౌరసంక్షేమ సమితి జిల్లా అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, జానో జాగో సంఘం కేంద్ర కమిటీ సభ్యుడు మేరాజ్ డిమాండ్ చేశారు. డీఎండబ్ల్యూవోపై అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని, వాటిపై విచారణ చేసి ఆ స్థానం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయన్ని తొలగించి పదవీకాలమున్న వారిని డీఎండబ్ల్యూవోగా కొనసాగిస్తే మైనార్టీ ప్రజలకు మేలు జరిగే అవకాశముందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అవినీతిపై తీవ్రంగా స్పందిస్తున్నందున్న తాము ఈ విషయాలను వెలుగులోకి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. మైనార్టీ నాయకులు సలీం, యాకూబ్ జాహంగిర్, పౌర సంక్షేమ సమితి ఉపాధ్యక్షుడు చీకోటి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

• నేడు శ్రీగోదారంగనాథుల కల్యాణం

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు శ్రీగోదారంగనాథస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సంపెట గంగరాజు, మాజీ సర్పంచ్ సోయినేని కరుణాకర్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

• నిధుల మంజూరుకు వినతి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని సత్సంగ సదనం నూతన భవన నిర్మాణానికి నిధులు ఇప్పించాలని కోరుతూ శనివారం కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని ఆ పార్టీ నాయకులు బండారి బాల్‌రెడ్డి, ద్యాప దేవయ్య కోరారు. భవన నిర్మాణానికి రూ.25లక్షలు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు. నిధుల మంజూరుకు మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

• మంత్రి సోదరుడిని కలిసిన విజయ్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని కోరుట్లపేటకు చెందిన జిల్లా రేవంత్ మిత్రమండలి అధ్యక్షుడు గూడ విజయ్‌రెడ్డి శనివారం కర్నాటక రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి సోదరుడు రంజిత్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు.

ఓబన్న ఆశయాలు కొనసాగిద్దాం



విగ్రహ ఆవిష్కరణలో నాయకులు

ముస్తాబాద్: బ్రిటిషువారిని ఎదురించిన గొప్ప వీరుడు వడ్డెర ఓబన్న అని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఓబన్న జయంతి సందర్భంగా శనివారం ముస్తాబాద్ మండలం గూడెంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఓబన్న ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, మాజీ చైర్మన్ అంజన్‌రావు, వడ్డెర సంఘం జాతీయ కార్యదర్శి సూర దేవరాజు, నాయకులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు..

ఎల్లారెడ్డిపేట: బ్రిటిష్‌వారిపై ఓబన్న వీరోచిత పోరాటాలు చేశారని వడ్డెర సంఘం జిల్లా జేఏసీ అధ్యక్షుడు గోగుల రమేశ్, మండల అధ్యక్షుడు శివరాత్రి లక్ష్మణ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఓబన్న 218వ వర్ధంతిని నిర్వహించారు. ఓబన్న విగ్రహం ఏర్పాటుకు నాయకులు శంకుస్థాపన చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు రవి, గౌస్, శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్, అరవింద్, సంతోష్, అశోక్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్లటౌన్/తంగళ్లపల్లి/బోయినపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేనేత, మరమగ్గాల కార్మికుల కోసం చేనేత పొదుపు భద్రత, భరోసా తదితర పథకాలు అమలు చేస్తున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో శనివారం సంబరాలు మిన్నంటాయి. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ పట్టణశాఖ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, పద్మశాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని శ్రీ భక్తమార్కండేయ ఆలయం ఎదుట సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు ప్రవీణ్ జేటోని, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రాపెల్లి ఆనందం పాల్గొన్నారు. బద్దెనపల్లి–సారంపల్లి టెక్స్‌టైల్ పార్కులో పవర్లూమ్ కార్మికులు, బోయినపల్లి మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, వన్నెల రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న రాంబాబు

సిరిసిల్లటౌన్: ఉద్యోగ, కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలు అమలు చేయాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి. రాంబాబుయాదవ్ డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో మాట్లాడారు. వచ్చే బడ్జెట్ సమావేశాలలో హామీలు అమలయ్యే బడ్జెట్ రూపకల్పన చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, కార్మికులను ఏకం చేసి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య, ఆశాల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సంతోష, హమాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, బీడీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంచే నర్సింలు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు అల్లి శ్రీనివాస్, మెడికల్, హెల్త్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి



సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని సరస్వతి శుభోదయం పాఠశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగవల్లులు వేసి వేడుకల్లో పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేట: పాయసంతో భక్తులు



గంభీరావుపేట: కూడారై వ్రతంలో భక్తులు

వైభవం.. కూడారై ఉత్సవం

ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం కూడారై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో నిర్వహించే శ్రీగోదారంగనాథుల కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. గంభీరావుపేట మండలకేంద్రంలోని శ్రీసీతారామస్వామి ఆలయంలో 108 పాత్రల్లో పాయసం ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుదారై వ్రతం నిర్వహించారు.